

మహిళలు ఒక్కచోట చేరే పండుగ



బతుకమ్మ పండుగ వస్తుందంటే ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. చుట్టు పక్కల ఉన్న ఆడ వాళ్లతో కలిసి పోయి బతుకమ్మను ప్రధాన కూడళ్లలో పెట్టి వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ పండుగ జరుపుకోవడం ఉల్లాసంగా ఉంటుంది. మహిళలందరూ ఒకచోట చేరే పండుగ బతుకమ్మ.

– గుండవరం సువర్ణ, గృహిణి, హుజూరాబాద్

భక్తిభావం తగ్గుతోంది



అప్పటి బతుకమ్మ పండుగ, ఇప్పుడు జరుపుకుంటున్న పండుగకు చాలా మార్పులు వచ్చాయి. అప్పట్లో పండుగ వస్తుందంటే శ్రద్ధ, నియమ నిష్టలతో బతుకమ్మలను తయారు చేసి పాటలు స్వయంగా పాడుకునేవాళ్లం. ఇప్పుడు సినిమా పాటలతో పండుగ జరుపుకోవడం బాధగా ఉంది. భక్తి భావం తగ్గుతుంది.

– బల్ల కనకమ్మ, గృహిణి, హుజూరాబాద్

సంతోషాలను తెచ్చే పండుగ



చిన్నారుల నుంచి నా వయస్సు వారందరికి సంతోషాలను తెచ్చే పండుగ. సాయంత్రం బతుకమ్మ ఆడాలంటే మధ్యాహ్నం నుంచిపూలను తేవడం, మాట్లాడకుండా బతుకమ్మను పేర్చి, సాయంత్రం ఆడిపాడేవాళ్లం. మహిళలు ఉత్సాహంగా జరుపుకునే పండుగ. తొమ్మిది రోజులు గ్రామాల్లో సందడి ఉంటుంది.

– శనిగరపు రత్తమ్మ, బోర్నపల్లి, హుజూరాబాద్

ఆవేదనల నివేదనలు

- ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు
- పరిష్కరించాలని వేడుకోలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు

కరీంనగర్అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు ప్రజావాణిని ఆశ్రయించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అత్యధికం వచ్చిన ఫిర్యాదులే మళ్లీ మళ్లీ రావడం విశేషం. సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించామని కాగితాల్లో చూపుతుండగా ఆచరణలో మాత్రం విరుద్ధ పరిస్థితి అని అర్జీదారులు వాపోతున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, నివేసన స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు రాగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ చొరవ చూపారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ అర్జీలు స్వీకరించగా, మొత్తం 318 దరఖాస్తులు వచ్చాయని కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించగా తమ ఆవేదనను వివరించారు. వివరాలు వారి మాటల్లోనే..



నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?

గ్రామ పంచాయతీల నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేస్తే ఏళ్లుగా నాన్చుతున్నారు. పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేయాల్సిందిపోయి అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. పనులు చేయకున్నా చేసినట్లు దొంగ రికార్డులు సృష్టించి ఎంబీలు రూపొందించారు. సుమారు రూ.16లక్షలు దుర్వినియోగం చేశారు. కలెక్టర్ తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.

– సీతంపేట గ్రామస్తులు, ఇల్లందకుంట

కొడుకు కొడుతుండు



మాది పేద కుటుంబం. ఇద్దరు కొడుకులను పెంచి పెద్ద చేసిన. పెద్ద కొడుకు గల్ఫ్‌లో ఉంటుండగా చిన్న కొడుకు ఊళ్లోనే ఉంటూ అప్పులు చేస్తూ మమ్మల్ని వేధిస్తున్నాడు. మా బాగోగులు చూసుకోకుండా డబ్బుల కోసం చిత్రహింసలు పెడుతున్నాడు. ఉన్నపాటి చిన్న ఇల్లును అమ్మాలని నానాబూతులు తిడుతూ కర్రలతో కొడుతున్నాడు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం ప్రకారం నాకు భద్రత కల్పించాలి.

– మల్లయ్య, రుద్రారం, రామడుగు

నాకిదేం గోస



గ్రామ శివారులోని సర్వే నంబర్ 479లో 20గుంటల భూమి ఉంది. వారసత్వంగా భూమి సంక్రమించగా దశాబ్దాలుగా సాగు చేస్తున్నాం. ధరణి రాకముందు పట్టాదారు పాసుపుస్తకం ఉండగా ధరణి వచ్చిన తర్వాత సంబంధం లేని వ్యక్తుల పేరున వస్తోంది. భూభారతి వచ్చినా నా సమస్య తీరడం లేదు. మోకాపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు.

– నీలం పోచమ్మ, పోరండ్ల, తిమ్మాపూర్



చొప్పదండిలో అమ్మవారికి పూజలు

దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

రామడుగు: గోపాల్‌రావుపేట, రామడుగు, వెదిర, వెలిచాల, దేశరాజ్‌పల్లి గ్రామాలలో సోమవారం నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మంటపాలలో భక్తులు శ్రీ దుర్గామాత దేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

చొప్పదండి: మండలంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు కొలువు దీరారు. భవానీ మాల ధారణ భక్తుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. విజయదశమి వరకు పూజలు నిర్వహించనున్నారు.



జమ్మికుంట: హౌజింగ్‌బోర్డు కాలనీలో..

జమ్మికుంట: పట్టణం, మండలంలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దుర్గామాత విగ్రహాలను భక్తులు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలించి భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



బతుకమ్మ వేడుకల్లో నరేందర్ రెడ్డి, వనజారెడ్డి

బతుకమ్మ సంబరాలు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. 'అల్ఫోర్స్ బతుకమ్మ మహోత్సవ్' పేరిట వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన వేడుకలను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి, డాక్టర్ వి.వనజారెడ్డి దంపతులు నవదుర్గ విగ్రహానికి, బతుకమ్మకు పూజ చేసి వేడుకలను ప్రారంభించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల ఉపాధ్యాయినిలు, సిబ్బందితో కలిసి బతుకమ్మ పాటలకు స్టెప్పులేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, టీచర్లు పాల్గొన్నారు.



జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. కరస్పాండెంట్ దబ్బెట విజయ రవీందర్, డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, చిరంజీవి, శివ , ప్రిన్సిపల్ వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పరుశురాం, భాస్కర్‌తోపాటు వాలంటీర్లు, విద్యార్థులు,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పండుగ పేరుతో వసూళ్లు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ రాజకీయ కుట్రల బారిన పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పండుగను నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తిమ్మాపూర్‌లోని బీఆర్ఎస్ నేత కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి అతిథి గృహంలో సోమవారం మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో పండుగను ఘనంగా నిర్వహించే పరిస్థితి కరువైందని, మహిళలు యూరియా కోసం లైన్లలో నిలబడుతున్నారని, పండుగను ఘనంగా నిర్వహిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి తగిన ఏర్పాట్లు చేయడంలేదని ఆరోపించారు. తెలంగాణ సంస్కతిని చెరిపేసే కుట్ర జరుగుతోందని, మానకొండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు రాంలీలా కార్యక్రమాల పేరుతో రూ.1.15 కోట్లు వసూలు చేశారని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం గ్రామానికి రూ.లక్ష చొప్పున కేటాయించాలని రసమయి డిమాండ్‌చేశారు. గ్రామాల్లో బతుకమ్మ విగ్రహాలకు రంగులు వేయడానికి నిధులు లేని దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, మహిపాల్ రెడ్డి, నాయిని వెంకటరెడ్డి, పాశం అశోక్ రెడ్డి, మాతంగి లక్ష్మణ్, వేల్పుల మల్లయ్య, నగునూరి బాబు, అంజయ్య, కవంపల్లి పద్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌లో ఆరోగ్య మహిళా శక్తివం తమైన కుటుంబ కార్యక్రమంలో భాగంగా సోమవారం పల్లె దవాఖాన ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. వైద్యులు కీర్తన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం వినియోగించుకోవాలన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి



నిరాహార దీక్షలో ఈదులగట్టెపల్లి గ్రామస్తులు

మానకొండూర్: తమ గ్రామానికి వెళ్లేలా నేషనల్ హైవే 563 రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామస్తులు సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా నేషనల్ హైవే పనులను అడ్డుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే సర్వీస్ రోడ్డు ఏర్పాటు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్ష వద్దకు ఎస్సై స్వాతి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడగా, మూడురోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

దుద్దెనపల్లిలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

సైదాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. సోమవారం మండలంలోని దుద్దెనపల్లిలో సరైన ధ్రువపత్రాలు లేని 71 వాహనాలను సీజ్ చేశామని, పెండింగ్ చలాన్ల ద్వారా రూ.30,900 రికవరీ చేశామన్నారు. గంజాయి, మత్తుపదార్థాలకు యువత బానిసైతే భవిష్యత్ అంధకారమవుతుందని, విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, చదువుతో పాటు సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. దసరా సెలవుల్లో విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా ఏదైనా సంఘటన జరిగితే డయల్ 100 ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్‌రూరల్ సీఐ వెంకట్, సైదాపూర్ ఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.



వీణవంక: మాట్లాడుతున్న సీడీపీవో సుగుణ

పోషకాహారంపై అవగాహన

వీణవంక: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకర రాష్ట్రాన్ని నిర్మిద్దామని హుజూరాబాద్ సీడీపీవో సుగుణ అన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహణ పారదర్శకంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీణవంక సూపర్‌వైజర్ రమాదేవి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో..

గన్నేరువరం: పోషణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ నిర్వహించారు. సూపర్‌వైజర్ కవిత పోషకాహారంపై అవగాహన కల్పించారు. కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, పాలు, ఎగ్స్, పండ్లు సమపాళ్లల్లో తీసుకోవాలని సూచించారు. బెల్లం, వేరుశనగలు, నువ్వులతో రక్తహీనత తగ్గించుకోవచ్చన్నారు. ఈసీసీఈ డే నిర్వహించి, పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రేణుక, సరోజన, పుష్పలత,

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కరీంనగర్: అండర్-19 ఎస్జీఎఫ్ చదరంగం పోటీల్లో కరీంనగర్ ట్రినిటీ కళాశాల విద్యార్థిని ఎం.వర్ష, అండర్-19 ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థి ఏ.రాఘవ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ట్రినిటీ కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం

కరీంనగర్‌కార్పొరేషన్: సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచే పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ నాయకుడు వుట్కూరి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 45వ డివిజన్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

● క్షీరాభిషేకం

జమ్మికుంట: జమ్మికుంటలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. జీఎస్టీ తగ్గించి ప్రజలందరికి దసరా కానుక అందించారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎల్ఐసీ ఆఫీసులో ఏజెంట్ల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

● జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

హుజూరాబాద్: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దసరా బొనాంజాగా జీఎస్టీ తగ్గించి ఎంతో మేలు చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్: పట్టణంలోని భారతీయ జీవిత బీమా సంస్థ కార్యాలయంలో జమ్మికుంట లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) ఆధ్వర్యంలో సోమవారం బీమా పాలసీలపై జీఎస్టీని ఎత్తివేయడాన్ని హర్షిస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

● తిర్మలాపూర్‌లో సీఎం చిత్రపటానికి

రామడుగు: చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి మల్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. తిర్మలాపూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల ఉపాధ్యక్షుడు కట్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదవశాత్తు బావిలోపడి వ్యక్తి మృతి

సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి యాదగిరి (45) ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడి మృతి చెందాడని సైదాపూర్ ఎస్ఐ తిరుపతి తెలిపారు.

● ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

శంకరపట్నం: తాడికల్ గ్రామంలో సోమవారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొని హోటల్‌లోకి దూసుకెళ్లింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూల్ నుంచి లారీలో వంట నూనెతో తాడికల్‌లోని ఓ వ్యాపారి గోదాంకు తీసుకువస్తుండగా లారీ ని రోడ్డుపై నిలిపి ఉంచగా ఖమ్మం నుంచి మహారాష్ట్రకు కర్రలోడ్‌తో వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొట్టి పక్కనే ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లగా రోడ్డు దాటుతున్న అరుణ మహిళకు గాయాలయ్యాయి.

● ప్రమాణ స్వీకారం

రామడుగు: మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో సోమవారం చొప్పదండి నియోజక వర్గ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా ఏలియా, ఉపాధ్యక్షుడిగా జాన్, కార్యదర్శిగా వినయ్ సాగర్, సంయుక్త కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా టైటాస్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు తిమోతి జయరాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

●వ్యాపారులు, కాంట్రాక్టర్ మధ్య వాగ్వాదం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వారసంతలో దుస్తుల వ్యాపారులు, వారసంత కాంట్రాక్టర్ మధ్య ధరల విషయంలో వాగ్వాదం జరిగింది. కార్యదర్శి నర్సయ్య రాజీ చేసుకోవాలని కాంట్రాక్టర్‌కు, వ్యాపారులకు సూచించారు.

● మేధో సంపత్తి హక్కులపై అవగాహన

సప్తగిరికాలనీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం మేధో సంపత్తి హక్కులు, పేటెంట్స్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు మేధా సంపత్తి విశిష్టత, మానవ మేధస్సును ఏ రకంగా రక్షణ కల్పించవచ్చు, కాపీరైట్స్ లక్షణాలు, పరిశోధనలో పేటెంట్స్‌ని ఎలా ఫైల్ చేయాలో తెలుపుతూ వ్యక్తిగత హక్కులను ఇండియన్ పేటెంట్స్ గురించి వివరించారు.

● కేంద్ర మంత్రిని కలిసిన ఉదయ్

గన్నేరువరం: కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సోమవారం కలిసినట్లు బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ నుంచి గన్నేరువరం మండలానికి మానేరువాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపామన్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయాన్ని మంత్రికి వివరించామని, ప్రజలకు అనువైన ప్రాంతంలోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరామన్నారు. అనంతరం బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

సభ్యత్వ నమోదు



కరీంనగర్: దేశ స్వాతంత్య్రం కోసం ఏర్పడి ఉద్యమించిన దేశంలోనే మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ కళాశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం కావాలని దేశవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేసి స్వాతంత్య్రం రావడంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా సహాయ కార్యదర్శి రాము యాదవ్, నాయకులు మచ్చ పవన్, అభి, అక్షయ్, ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

మకరతోరణం బహూకరణ



సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, సోదరులు మకరతోరణం బహూకరించారు. సోమవారం తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, నాగిరెడ్డి ఐదున్నర కిలోల వెండితో తయారు చేయించిన మకరతోరణం స్వామివారికి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రపాణి వెంకటాచార్యులు రెండున్న కిలోల వెండితో కిరీటం చేయించారు. ఆలయ అర్చకుడు జగ్గయ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేముగంటి మురళీమనోహర్‌రావు, గుండేటి శ్రీనివాస్, కొత్త అశోక్‌రెడ్డి, చిక్కుల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీపీ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం పింఛన్‌దారులు ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సేవా కేంద్రం అధ్యక్షుడు పైడమల్ల శ్రీనివాస్‌గౌడ్, వడ్డేపల్లి రమేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్డేపల్లి రమేశ్, అంబాల మధునయ్య, గట్టుసాయి తేజ, ఎండీ సాహిద్, శంకరయ్య, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సదానందం, శేఖర్ ఉన్నారు.

టీబీ నివారణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ చందు,తదితరులు

జమ్మికుంట: టీబీ నివారణపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, రిసోర్స్ పర్సన్ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ సురేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వర్తక సంఘం భవనంలో టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో వావిలాల, ఇల్లందకుంట, చల్లూరు పీహెచ్‌సీ వైద్యధికారుల ఆధ్వర్యంలో టీబీ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి రహిత గ్రామాలే లక్ష్యంగా టీబీ చాంపియన్లు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇల్లందకుంట పీహెచ్‌సీ డాక్టర్ తులసీదాస్, ఎల్‌పీహెచ్‌పీ డాక్టర్ మహోన్నత పటేల్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, మోహన్‌రెడ్డి, యూఎస్‌టీఏస్ దేవేందర్‌రెడ్డి, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు సిబ్బంది గీతాంజలి, తిరుపతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలతో విజ్ఞానం



ప్రదర్శన తిలకిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా 'యువర్ సేఫ్టీ జస్ట్ ఏ క్లిక్ అవే' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సోమవారం అవయవాల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయగా కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంప్ర శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ విశ్వనాథ బాలకిషన్ ప్రారంభించారు. ప్రదర్శనలో అవయవాల నమూనాలను విద్యార్థులు విపులంగా వివరించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం మరింత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, విభాగాధిపతి శ్రవణ్ కుమార్, సిబ్బంది శ్రావణ్ కుమార్, రేఖ ఠాకూర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో సోమవారం ఓ ప్రైవేట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శైలజ వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధులను నిర్లక్ష్యం చేస్తుండటంతో ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకొని సరైన మందులు వాడాలని సూచించారు. వైద్య శిబిరం నిర్వాహకులు మునీందర్, మాజీ సర్పంచ్ దర్శన్‌రావు, కొత్తూరు రాజేందర్, క్యాతం సతీశ్, అనంతరాజు, మేకల కిరణ్, కట్ట రవీందర్, ప్రశాంత్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న రాసపల్లి సరిత నేషనల్ టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికైందని శారద ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమలమనోహర్ తెలిపారు. హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో 25న సొసైటీ ఆధ్వర్యంలో అవార్డు అందజేయనున్నామన్నారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలకు అవార్డు అందుకుంటున్న సరితకు సహచర ఉపాధ్యాయులు, బంధు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం

గంగాధర: మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లింగాల హరిప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.పదివేలు అందజేయగా కార్యకర్తలు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.